క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వైఎంసీఏ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పొగతోట, సోమశేఖరపురం, వీఆర్సీసెంటర్, బాకలివీధి, ట్రంకురోడ్డు, బృందావనం పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న యూటీఎఫ్ నిరవధిక దీక్ష



నెల్లూరు (టౌన్): పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో చేపడుతున్న నిరవధిక దీక్ష కొనసాగుతోంది. రెండో రోజు శనివారం పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషు, చలపతిశర్మ, కోశాధికారి మురళీధరరావు, అసోసియేట్ అధ్యక్షుడు అప్పయ్య, కార్యదర్శులు నాగిరెడ్డి, ఖాజావలి, దయాకర్, బాలరాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా సదస్సుకు నెల్లూరువాసి



జేకే స్వప్న

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఇండియన్ యోగా అసోసియేషన్, దేవ సంస్కృత యోగా విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా సదస్సుకు నెల్లూరుకు చెందిన జేకే స్వప్నకు ఆహ్వానం అందిందని ఆ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఆనందీబాలయోగీ భవనాని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హరిద్వార్‌లో నవంబర్ 17 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న యోగా సదస్సులో 'నేటి జీవనశైలి-యోగా నియమనియమాల అవశ్యకత' అనే అంశంపై నిర్వహించనున్న వర్క్‌షాప్‌నకు ఆమెను ఆహ్వానించినట్లు తెలిపారు.

జ్వాలాముఖి ఆలయాభివృద్ధికి కృషి

• రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నవరాత్రులను పురస్కరించుకుని వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి ఆలయాన్ని మంత్రి కాకాణి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి సారె సమర్పించారు. ముందుగా మంత్రికి ఆలయ చైర్మన్ కోసూరు రవీంద్రయ్యతో పాటు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరినట్లు తెలిపారు. స్థానిక నేతలు విష్ణుమోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్యామలమ్మ, సునీల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, హరి, ఈఓ శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అదనపు కట్నం కోసం భార్యపై భర్త హత్యాయత్నానికి పాల్పడిన ఘటన రేబాల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం రేబాల గ్రామానికి చెందిన ఈదూరు నవీనకు విడవలూరు మండలం దండిగుంటకు చెందిన ఈదూరు శ్రీనివాసులుతో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మద్యానికి బానిసైన శ్రీనివాసులు తరచూ భార్యను అదనపు కట్నం తీసుకురావాలని వేధించేవాడు. దీనిని భరించలేక నవీన ఈనెల 10న రేబాలలోని తన పుట్టింటికి వచ్చింది. దీంతో భార్యపై కక్ష పెంచుకున్న శ్రీనివాసులు ఈ నెల 15న రేబాలకు వచ్చాడు. భార్య ఇంట్లో నిద్రిస్తుండగా కత్తితో మెడపై నరకబోయాడు. వెంటనే తేరుకున్న నవీన భర్తను అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆమె చేతికి తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు బుచ్చిరెడ్డిపాళెంలోని వైద్యశాలలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బుచ్చిరెడ్డిపాళెం ఎస్సై విశ్వనాథ్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద శుక్రవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన మహేష్ పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు వస్తుండగా కసుమూరు మలుపు రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో మహేష్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సరస్వతీ నమస్తుభ్యం



నరసింహకొండపై సరస్వతీదేవిగా ఆదిలక్ష్మీదేవి



నవాబుపేటలోని శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో..



చండీదేవిగా ఇరుకళల పరమేశ్వరి



సుజాతమ్మకాలనీలో సరస్వతిదేవి అలంకారం




విశేషాలంకారంలో కన్యకాపరమేశ్వరి మూలవిరాట్



రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో సరస్వతి అలంకారం



సరస్వతి అలంకారంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



వెంకటేశ్వరపురంలో సరస్వతిగా శ్రీవారు



కోదండరామపురంలో మహాలక్ష్మి అలంకారం



బాలాజీనగర్ సీతారామస్వామి మందిరంలో మహాసరస్వతి అలంకారం

నెల్లూరు(బృందావనం): నగరంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులను కటాక్షించారు.

- నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీలలితా కుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా బండారు మధుసూదన్‌రెడ్డి, రజని, ఏలూరు శివనారాయణ, శిరీష, అమ్మనబ్రోలు శ్రీధర్‌రెడ్డి, శ్రీకళ దంపతులు వ్యవహరించారు.
- నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా మారంరెడ్డి శేషారెడ్డి, ప్రమీలమ్మ దంపతులు వ్యవహరించారు.
- సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శ్రీచండీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషాభిషేకాలు, పూలంగిసేవ, పల్లకిసేవ, లక్ష కుంకుమార్చన, చండీయాగం నిర్వహించారు. ఉభయకర్తలుగా కారంశెట్టి కిరణ్‌కుమార్, లలితారాణి దంపతులు, మెట్టు సురేష్‌బాబు, సుభాషిణి, జీ వెంకటేశ్వర్లునాయుడు, సునీత దంపతులు వ్యవహరించారు.
- మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నవావరణ పూజ, పుష్పాలంకారం, చండీ హోమం నిర్వహించారు. ఉభయకర్తలుగా గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు, మైథిలి, కే విజయభాస్కరరెడ్డి, అరవింద, దేవిశెట్టి శ్రీహరి, వెంకటసుదర్శనమ్మ దంపతులు వ్యవహరించారు.
- మూలాపేటలోని శ్రీమత్ ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీసరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా డాక్టర్ రఘురాజసింహ, హిమజ దంపతులు వ్యవహరించారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. మూలవర్లను పుస్తకాలు, పెన్నులతో అలంకరించారు. పూలంగిసేవ కనులపండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా చలువాది మల్లికార్జునరావు, లక్ష్మీశివకుమారి దంపతులు, కుటుంబసభ్యులు వ్యవహరించారు.
- సీఏఎం హైస్కూల్‌రోడ్డులోని ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీకాళి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా నేరేళ్ల మురళీకృష్ణ, పార్థసారథిగుప్తా వ్యవహరించారు.
- నవాబుపేటలోని శ్రీమత్‌ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పోట్లపూడి అంజయ్య, సాదా వెంకటసుబ్బయ్య, లక్ష్మమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారులు వ్యవహరించారు.
- కోదండరామపురంలోని శ్రీమహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కాటేపల్లి వెంకటరమణయ్య, సరిత, చదలవాడ ప్రసాద్, కాంచన, ఈదల రమణారెడ్డి, రాజేశ్వరి, చెరుకూరు రమేష్‌నాయుడు, శ్రీలక్ష్మి దంపతులు వ్యవహరించారు. .
- సుజాతమ్మ కాలనీలోని శ్రీఅష్టలక్ష్మి మందిరంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. స్వర్ణమహాలక్ష్మి, ఉమాదేవి అమ్మవార్లు విశేషాలంకారంలో భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తలుగా పీ విజయకుమార్‌రెడ్డి, వసంతమ్మ, డాక్టర్ సత్యనారాయణ, రుక్మిణి, చిప్పకుల శ్యామ్‌సుందర్ ప్రభు, లలిత దంపతులు వ్యవహరించారు.
- విరాట్‌నగర్‌లోని గాయత్రిదేవి, విశ్వకర్మభగవాన్ స్వామి గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా నేరెళ్ల వెంకటసత్యనారాయణ, వెంకటసుభాషిణి, పందల పెంచలరెడ్డి, రమాదేవి, విజ్ఞచరణ్, స్రవంతి, మునగా ద్వారకానాథ్‌శ్రేష్ఠి, సాయికుమారి, పీ వెంకటసత్యనరేష్‌బాబు ఆచారి, భవానీ దంపతులు వ్యవహరించారు.
- నవాబుపేటలోని కామిశెట్టి వారి మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పంచాగ్నుల పవన్‌కుమార్ దంపతులు వ్యవహరించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు మహాసరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విశేషాభిషేకాలు, ధనలక్ష్మి హోమం, కుంకుమార్చన, అష్టలక్ష్మి వైభవం, శ్రీసత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఉభయకర్తలుగా చేవూరు హేమచంద్రారెడ్డి, గ్రీష్మ, అఖిలేష్‌రెడ్డి, సాయిలీల దంపతులు, ఆకు పుండరీకాక్షం కుమారులు ఆకు వెంకటశేషసాయి, నీలిమ, ఆకు లీలామోహన్, లక్ష్మి దంపతులు వ్యవహరించారు.
- వేదాయపాళెంలోని స్వామిఅయ్యప్ప దేవస్థానం ప్రాంగణంలోని గురువాయూర్ మహావిష్ణు దేవస్థానంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా శ్రీస్వామిఅయ్యప్ప సేవా సమాజం నిర్వాహకులు వ్యవహరించారు.
- మహాత్మాగాంధీనగర్‌లోని శ్రీకృష్ణమందిరం ప్రాంగణంలోని వైభవలక్ష్మి ఆలయంలో అమ్మవారు విద్యాలక్ష్మిసరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా అమ్మవారి భక్తబృందం వ్యవహరించారు.
- సంతపేట, కంసాలివీధిలోని భ్రమరాంబ సమేత హరిహరనాథస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా నూరం రాజశేఖరరెడ్డి, పెంచలలక్ష్మి దంపతులు వ్యవహరించారు.

సరస్వతిగా ఆదిలక్ష్మీదేవి

నెల్లూరు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లురెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సరస్వతి అలంకారంలో శ్రీవారు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరపురంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారు సరస్వతి అలంకారంలో హంస వాహనంపై దర్శనమిచ్చారు. ఉభయకర్తగా శ్రీనివాసులు వ్యవహరించారు.

- 53వ డివిజన్ గాంధీగిరిజన కాలనీలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తలుగా దేవరకొండ ప్రభాకర్, కవిత, వినయ్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.



మూలస్థానేశ్వరాలయంలో సరస్వతి అలంకారం



నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో చిన్నారుల నృత్య ప్రదర్శన



రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

'పీఎం విశ్వకర్మ'ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి

నెల్లూరు(మినీబైపాస్): ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పీఎం విశ్వకర్మ పథకానికి రాష్ట్రంలోని నెల్లూరు, తిరుపతి, నర్సాపురం జిల్లాలను మొదట విడతగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన 18 రకాల హస్త కళాకారులకు శిక్షణతో పాటు రుణాలను అందించనున్నట్లు వివరించారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 నగదుతో పాటు శిక్షణ పూర్తయిన తర్వాత రూ.15 వేల విలువైన కిట్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. చేతి వృత్తిదారులు పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర నాయకులు కందుకూరి సత్యనారాయణ, పుట్టేటి సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు యరబోలు రాజేష్, గడ్డం విజయ్ కుమార్, బుజ్జిరెడ్డి, ఎస్‌కే యశ్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

శేషేంద్రశర్మ జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదానం



పెరుగు, టేకుమళ్లకు శేషేంద్రశర్మ పురస్కారాల ప్రదానం

నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలుగు యుగ కవి గుంటూరు శేషేంద్రశర్మ జయంతి సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శేషేంద్రశర్మ సాహిత్య సేవలను కొనియాడారు. అనంతరం శేషేంద్రశర్మ జాతీయ సాహిత్య పురస్కారాలను కవులు పెరుగు రామకృష్ణ, టేకుమళ్ల వెంకటప్పయ్యకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి శ్రీధర్, సింహపురి ఫైన్‌ఆర్ట్స్ అకాడమీ సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్, విశిష్ట అతిథి ఆచార్య రాజేంద్రసింగ్ శేషేంద్ర, అరసం జిల్లా సభ్యులు సుధీర్, శ్రీమన్నారాయణ, నరేంద్ర, రచయితలు గోవిందరాజు సుభద్ర, శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అపహరణ

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు వాకిలి శుభ్రం చేస్తున్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు..బాలాజీనగర్‌లో పీ సుబ్బారావు, శ్రీలక్ష్మమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. శ్రీలక్ష్మమ్మ ఈ నెల 19న తన ఇంటి ముందు వాకిలి శుభ్రం చేస్తుండగా గుర్తుతెలియని దుండగులు బైక్‌పై అక్కడకు వచ్చారు. బైక్‌పై వెనుక కూర్చుని ఉన్న వ్యక్తి కిందకు దిగి వృద్ధురాలి మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసును తెంపుకుని బైక్ ఎక్కి పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు అదేరోజు రాత్రి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కే సుమన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



రోగులకు మందుల కిట్ అందజేస్తున్న అదనపు కమిషనర్ శర్మద



నెల్లూరురూరల్ మండలం దొంతాలిలో..

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద పేర్కొన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని హనుమాయమ్మవీధి, ఇసుకడొంక, ట్రైలర్స్‌కాలనీ, బాలాజీనగర్, ఆకుతోట, ద్వారకానగర్, శాంతినగర్, రాజాగారివీధి, భగత్‌సింగ్ కాలనీ, పోలేరమ్మబెట్టు వీధి, జీనిగలవారివీధి ప్రాంతాలకు సంబంధించిన ఆరోగ్య కేంద్రాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను శుక్రవారం నిర్వహించారు. అదనపు కమిషనర్ శర్మద, టీపీ ఆర్వోలు ప్రసాద్, జీజియాబాయి వైద్యశిబిరాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శర్మద మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, సచివాలయ హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ ఎంపీపీ విజయకుమార్ అన్నారు. నెల్లూరు రూరల్ మండలం దొంతాలిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ ఆధ్వర్యంలో వైద్యులు నాయక్, కవిత, వైద్యారోగ్య సిబ్బంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



నెల్లూరురూరల్: రూరల్ నియోజకవర్గంలోని 12వ డివిజన్ పరిధిలోని ప్రజాసమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నగర మేయర్ స్రవంతి పేర్కొన్నారు. 12వ డివిజన్ పరిధిలోని పీకేజీ కాలనీలో శుక్రవారం మేయర్ పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మేయర్ వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, నగర పాలక సంస్థ సిబ్బంది ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 31 మందికి జరిమానా

నెల్లూరు(క్రైమ్): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 31 మందికి న్యాయమూర్తి జరిమానా విధించారు. ఇటీవల చిన్నబజారు, నార్త్‌ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 31 మంది పట్టుబడ్డారు. వారిని పోలీసు అధికారులు శుక్రవారం నెల్లూరు రెండో అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఎల్ శారదారెడ్డి మందుబాబులు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.3.10 లక్షలు జరిమానా విధించారు.